క్లుప్తంగా

ఆర్థిక సాయం

కుల్కచర్ల: పిడుగుపాటుకు ఈ నెల 7న రైతు లాలుకు చెందిన 5 పశువులు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. విషయం తెలిసిన ముదిరాజ్ మహాసభ జాతీయ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ బాధిత కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు.

పోలీసుల పనితీరు భేష్



గుంతలు పూడ్చివేయిస్తున్న పోలీసులు

తాండూరు రూరల్: గుంతలమయమైన రోడ్డుకు కరన్ కోట్ పోలీసులు మరమ్మతులు చేయించారు. పట్టణంలోని శేష్‌ప్రభ టాకీస్ నుంచి గౌతపూర్ వరకు రోడ్డులో గుంతలు ఏర్పడ్డాయి. దీనికి స్పందించిన కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి.. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం గుంతలను పూడ్చించారు. గోతుల్లో నాపరాతి ముక్కలను వేసి, జేసీబీతో చదును చేయించారు. వర్షాకాలం రావడంతో గుంతల్లో వాన నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. దీనిని గుర్తించిన పోలీసులు.. ప్రజాశ్రేయస్సు దృష్ట్యా తాత్కాలికంగానైనా.. మరమ్మతు చేయించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

గురునాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న గురునాథ్‌రెడ్డి

కొడంగల్: రాష్ట్ర పోలీస్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయనకు అభిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి సన్మానించారు. కేక్ కట్ చేసి తినిపించారు. ఇందులో మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, డీడీఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారి, మాజీ ఉప సర్పంచ్ గౌసస్, పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, మైనార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దుద్యాల్: సీజనల్ వ్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సౌమ్యరాణి అన్నారు. గురువారం మండల పరిధి చిలుముల మైల్వార్‌లో పంచాయతీ కార్యదర్శి, ఆశ కార్యకర్తలతో కలిసి పలు వీధుల్లో పర్యటించారు. పరిశుభ్రత, విషజ్వరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వర్షాకాలంలో పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. లేని పక్షంలో దోమలు పెరిగి, సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పంచాయతీ సిబ్బందితో గ్రామంలో ఎక్కడ చెత్తాచెదారం ఉన్నా.. వాటిని తొలగించేలా చర్యలు చేపట్టాలని జీపీ కార్యదర్శులను ఆదేశించారు. జీపీ కార్యదర్శి డేవిడ్, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి



మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

అనంతగిరి: మున్సిపల్ రెవెన్యూ విభాగం ఔట్ సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని బిల్ కలెక్టర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, కమిషనర్ జాకిర్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని, తమను రెగ్యులరైజేషన్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో చందర్‌సింగ్, సోమయ్య, జగదీష్, అరుణ్, అశోక్, శ్రీహరి ఉన్నారు.

తెలంగాణ ఉద్యమ కళాకారులను ఆదుకోవాలి

కందుకూరు: తెలంగాణ ఉద్యమ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కళాకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు మహేశ్ డిమాండ్ చేశారు. గురువారం కళాకారులతో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ఉద్యమ సమయంలో కాలికి గజ్జ కట్టి గ్రామ గ్రామాన తిరిగి ధూంధాం చేసిన గొంతులు మూగబోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామీణ కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉందన్నారు.



దుద్యాల్: మండల కేంద్రంలో విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు



పరిగి: నస్కల్‌లో పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

విద్యతోనే సమాజంలో గుర్తింపు

బడీడు పిల్లలను సర్కారు స్కూల్‌లో చేర్పించండి
- ప్రభుత్వ సదుపాయాలను వినియోగించుకోండి
- ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు
- విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాల అందజేత

దుద్యాల్: విద్యతోనే సమాజంలో సరైన గుర్తింపు వస్తుందని జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం నెహ్రూ చౌహాన్ అన్నారు. గురువారం విద్యార్థులకు ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. బడీడు పిల్లలను తప్పకుండా బడికి పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. చదువుకునే వయస్సులో పిల్లలు పెడదారి పట్టకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించి వారికి విద్యాబుద్ధులు చెప్పాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని ఆయన వెల్లడించారు. ఇందులో ఉపాధ్యాయులు అనిల్, మల్లప్ప, శిల్ప, సుధాకర్ రావ్, వెంకటయ్య, శ్రీనివాస్, ఏఏపీసీ చైర్మన్ గోవిందమ్మ, మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవాలని రాష్ట్ర పోలీస్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, పాఠశాల కరస్పాండెంట్, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని శ్రీ బాలాజీ కేజీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు, పాఠ్య పుస్తకాలు ఆయన పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను బోధిస్తున్నారని తెలిపారు. ఎంతో మంది పిల్లలు పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి, ఆదర్శంగా నిలుస్తున్నారని వెల్లడించారు. ఎంఈఓ రాంరెడ్డి, పాఠశాల కార్యదర్శి జయతీర్థాచారి, హెడ్‌మాస్టర్ వెంకటప్ప ఉన్నారు.

తల్లిదండ్రులు ఆలోచించి..

దౌల్తాబాద్: గోకఫసల్‌వాద్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలను ఎంపీటీసీ కేశవరెడ్డి, ఏఏపీసీ చైర్మన్ శకుంతల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం.. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని, కావున తల్లిదండ్రులు ఆలోచించి, తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలన్నారు. హెచ్‌ఎం మల్లికార్జున్, ఉపాధ్యాయులు నర్సింలు, సాయిలు గౌడ్, వీరన్న, రేణుక, రజియా, శానమ్మ ఉన్నారు.

ప్రైవేటుకు దీటుగా..

పరిగి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నామని ప్రధానోపాధ్యాయులు అన్నారు. మండల పరిధి నస్కల్, బర్కత్‌పల్లి, రంగంపల్లి, మాధారం, రంగంపల్లి, రంగాపూర్ తదితర పాఠశాలల్లో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రైవేటుకు దీటుగా సర్కారు బడులు కొనసాగుతున్నాయని, వీటిల్లో చదివే వారికి ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలను సమకూర్చుతుందని వెల్లడించారు. ఆంగ్ల మాధ్యమం కొనసాగుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు.

పోతిరెడ్డి పాఠశాలలో..

దోమ: ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య అందుతుందని ఎంపీపీ అనసూయ అన్నారు. మండల పరిధి పోతిరెడ్డిపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నర్సింహులుతో కలిసి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులను అందజేశారు. అనంతరం మాట్లాడారు. ప్రతి విద్యార్థికి ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దుస్తులు, నాణ్యమైన మధ్యాహ్న భోజనంతో పాటు.. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాఠాలు బోధిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. తల్లితండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాల చైర్మన్ సుగుణ, ఉపాధ్యాయులు శివనీల, అంగన్వాడీ టీచర్ తులసి, ఆశ వర్కర్ యశోద తదితరులు ఉన్నారు.

మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లు



అడ్మిషన్లు తీసుకుంటున్న ప్రిన్సిపాల్

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రకాష్‌గౌడ్ అన్నారు. మండల పరిధి జినుగుర్తి గేటు వద్ద ఉన్న మోడల్ స్కూల్‌లో నూతనంగా అడ్మిషన్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తరగతులు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా ఇంటర్మీడియట్‌లో విద్యార్థినులకు హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.



దౌల్తాబాద్: గోకఫసల్‌వాద్‌లో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ తదితరులు



కొడంగల్: పుస్తకాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి తదితరులు

బడిబయట చిన్నారులను గుర్తించండి

పెద్దేముల్: ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని హెచ్‌ఎం సునిత అన్నారు. పెద్దేముల్ బాలుర ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయురాలు సునిత ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విధుల పట్ల ఎవరూ నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలకు వచ్చేలా కృషి చేయాలని చెప్పారు. అందుకు బడిబయట ఉన్న చిన్నారులను గుర్తించి, బడుల్లో చేర్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. గ్రామస్తుల సహకారం తీసుకోవాలన్నారు. పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తెచ్చేలా పనిచేయాలని కోరారు. ఇందులో ఉపాధ్యాయులు ద్యావరి నరేందర్‌రెడ్డి, రాధ, శంకర్, మంజుల ఉన్నారు.

కార్యకర్తలను ఆదుకుంటాం

షాబాద్: మండలంలోని అంతారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త ఈగ సురేందర్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం షాబాద్‌లో జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి సురేందర్‌రెడ్డి కుటుంబానికి తనవంతు సాయంగా రూ.3 లక్షలు అందజేశారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ పార్టీ తరఫున బీమా డబ్బులు రూ.2లక్షలు గతంలో అందజేసినట్లు ఆయన తెలిపారు. ఆపదలో ఉన్న బీఆర్‌ఎస్ కార్యకర్త కుటుంబాన్ని ఆదుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొట్ల మహేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

‘ప్రైవేట్ బడుల్లో అంతులేని దోపిడీ’

అనంతగిరి: కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని, విద్యను వ్యాపారం చేస్తూ.. అంతులేని దోపిడీకి తెగబడుతున్నాయని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు ఆరోపించారు. గురువారం వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం.. పాఠశాలకు కొద్ది దూరంలో ఓ దుకాణం ఏర్పాటు చేసి పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నారనే సమాచారంతో హరీశ్ తదితరులు అక్కడికి చేరుకున్నారు. అనంతరం జిల్లా విద్యాధికారులకు సమాచారం అందజేసి, సీజ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, డ్రెస్సులు అధిక ధరలకు విక్రయించడంతో పాటు అడ్డగోలుగా ఫీజులు పెంచి, విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నారని విమర్శించారు. అలాంటి పాఠశాలలను గుర్తించి, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, జగదీష్, రాజేందర్, అక్షిత్, మురళి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తక విక్రయ దుకాణం ఎదుట ఏబీవీపీ నాయకులు

అర్హులందరికీ ‘గృహజ్యోతి’ ఇవ్వాలి

తాండూరు టౌన్: అర్హులందరికీ ‘గృహజ్యోతి’ పథకాన్ని అమలు చేయాలని బీజేపీ స్థానిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించిన వారందరికీ జీరో బిల్లు అందజేస్తామని చెప్పిన కాంగ్రెస్.. అధికారం చేపట్టాక మాట తప్పిందని విమర్శించారు. ఎన్నికలు ముగిసి ఆరు నెలలు అవుతున్నా అర్హులందరికీ జీరో బిల్లు అమలు కావడం లేదన్నారు. ఎన్నికల కోడ్ అంటూ కాలక్షేపం చేసిన ప్రభుత్వం.. కోడ్ ముగిసిన తర్వాత కూడా పేదలకు న్యాయం చేయకపోవడం సిగ్గు చేటన్నారు. జీరోబిల్లు రావటం లేదని విద్యుత్ కార్యాలయానికి వెళ్తే.. మున్సిపల్ లేదా ఎంపీడీఓ కార్యాలయాలకు వెళ్లాలని సూచిస్తుండటంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులందరికీ జీరో బిల్లు అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



ట్రాన్స్‌కో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఆధునిక సాగుకే మొగ్గు



యంత్రంతో కంది విత్తనాలు వేస్తున్న రైతు

కొడంగల్: అన్నదాతలు ఆధునిక వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పొంది, తద్వారా అధిక ఆదాయం రాబట్టేందుకు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం సాగు ఖర్చులు విపరీతంగా పెరిగాయి. దాంతో పాటే కూలీ రేట్లు అధికమై.. రైతులకు కుదిబండగా మారింది. వ్యయం పెరిగి ఆదాయం తరుగుతున్న నేపథ్యంలో రైతులు ఆధునిక సేద్యానికే మక్కువ చూపుతున్నారు. ఖర్చులు తగ్గించుకునేందుకు యంత్రాలను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభం కాగా.. యంత్రాలతో సాగు పనులు ముమ్మరం చేశారు. కంది, పెసర, మినుము, కుసుమలు, జొన్న విత్తనాలు విత్తుతున్నారు. కూలీల ఖర్చు తగ్గడమే కాకుండా.. రోజుకు 8 ఎకరాల విస్తీర్ణంలో విత్తనాలు వేయవచ్చని రైతులు చెబుతున్నారు. తక్కువ పెట్టుబడితో పంటలు పండించి, లబ్ధిపొందే యోచనలో.. వ్యవసాయ శాస్త్రవేత్తల సలహా మేరకు యంత్రాలను కొనుగోలు చేసి, సాగు చేస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిమ్స్ అసుపత్రి వైద్యులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వద్దు, పర్యావరణ ముద్దు అని పిలుపునిచ్చారు. శబ్ద కాలుష్యం తగ్గిద్దాం.. శతాబ్ది కాలం జీవిద్దాం అంటూ నినదిస్తూ.. ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిమ్స్ వైద్యులు పూనమ్‌సుతర్, విరాజ్‌కుమార్, జిమ్స్ మెడికల్ కళాశాల సోషల్‌వర్కర్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, అంగన్‌వాడీ టీచర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గద్దెనెక్కిన దుర్గమ్మ



దుర్గమ్మ గద్దె, ఆలయ ప్రాంగణంలో భక్తులు

బొంరాస్‌పేట: దుర్గమ్మ బోనాల పండుగను రెండో రోజు గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకల సందర్భంగా తరలి వచ్చిన భక్తజనంతో మండల కేంద్రం కళకళ లాడింది. సాయంత్రం గుడి ఎదుట కుంభం మీద గద్దెనెక్కిన దుర్గమ్మ పూనకాలతల్లి.. ఈ ఏడు గ్రామం జాతకాలు, పంటలు, వివాహాలు, పేరుబలాల జాతకం చెప్పారు. గ్రామస్తులు పాద ప్రదక్షిణతో మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు నర్సింలు గౌడ్, రాంచంద్రారెడ్డి, పొట్ట రామకృష్ణ, లచ్చప్ప, వీరేశం తదితరులు ఉన్నారు.

మొక్కజొన్న సాగుపై మక్కువ



మొక్కజొన్న సాగును పరిశీలిస్తున్న ఏఈఓ పెంటయ్య

వ్యవసాయ విస్తరణ అధికారి పెంటయ్య

మోమిన్‌పేట: మొక్కజొన్న సాగుకు రైతులు మక్కువ చూపాలని ఏఈఓ పెంటయ్య సూచించారు. గురువారం మండల పరిధి కోల్కుందలో మొక్కజొన్న సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వానాకాలంలో మొక్కజొన్న సాగు లాభాలను తెచ్చిపెడుతుందని తెలిపారు. ఎకరాలో పశువుల ఎరువును కలియ దున్ని విత్తనాలను విత్తుకోవడం వలన అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు. వ్యవసాయ అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలను పాటిస్తే ఎకరాకు 35క్వింటాళ్ల నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని వెల్లడించారు. ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయిస్తే లాభాలు వస్తాయని ఏఈఓ పేర్కొన్నారు. మొక్కజొన్న పంట తీసిన తర్వాత నేలను బట్టి రబీలో రెండో పంటగా తెల్ల జొన్న, తెల్ల కుసుమ, శనగను సాగు చేయవచ్చని అన్నదాతలకు సూచించారు. వానాకాలం, యాసంగి పంటలను సాగు చేసే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. రెండు పంటలను సాగు చేయడం వలన రైతులు అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని స్పష్టంచేశారు.

అంకితభావంతో పనిచేస్తే ప్రజాదరణ



రాధికను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హెచ్‌ఎం జయమ్మ

షాద్‌నగర్‌రూరల్: ఉద్యోగులు తమ విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు లభిస్తుందని హెచ్‌ఎం జయమ్మ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ జెడ్పీ హెచ్‌ఎస్‌లో తొమ్మిది సంవత్సరాలుగా ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న రాధిక పదోన్నతిపై నల్గొండ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు రాధికను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జయమ్మ మాట్లాడుతూ.. బోధనలో రాధిక ఉత్తమ ప్రతిభను కనబరిచి విద్యార్థులు, తల్లితండ్రుల మన్ననలు అందుకున్నారని పేర్కొన్నారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలిగా పదోన్నతి పొందిన రాధిక భవిష్యత్‌లో మరెన్నో పదోన్నతులు పొందాలన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

నిరుపయోగంగా పశువుల ఆస్పత్రి భవనం

మోమిన్‌పేట: పశువుల ఆరోగ్యమే లక్ష్యంగా రూ.లక్షలు పోసి నిర్మించిన ఆస్పత్రి భవనం నిరుపయోగంగా ఉంది. మండల పరిధి ఏన్కతల గ్రామంలో మూడేళ్ల క్రితం నూతనంగా పశువుల ఆస్పత్రి భవనాన్ని నిర్మించారు. కానీ దానిని వినియోగంలోకి తేవడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేశారు. దీంతో ఆ భవనం క్రమంగా ఆనవాళ్లు కోల్పోయి.. పాడుబడిన బంగ్లాన్ని తలపిస్తోంది. స్థానిక రైతులు మాట్లాడుతూ.. మూగజీవాల ఆరోగ్య సంరక్షణ కొరకు నిర్మించిన భవనాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించి, ఇలా వదిలేయడం ఎంతవరకు సమంజసమని, ప్రజాధనం అంటే లెక్క లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఆస్పత్రి భవనాన్ని వినియోగంలోకి తేవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



పశువుల ఆస్పత్రి భవనం

పేద విద్యార్థులకు చేయూతనివ్వండి

షాబాద్: పేద విద్యార్థులకు దాతలు సాయం చేసి ప్రోత్సహించాలని రేగడిదోస్వాడ మాజీ సర్పంచ్ రాములు, ఎంపీటీసీ పార్వతమ్మ అన్నారు. గురువారం మండల పరిధి రేగడిదోస్వాడ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీలో గ్రామస్తుడు కుమ్మరి శ్రీనివాస్ విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాతలు ముందుకు వచ్చి పేద విద్యార్థులకు కావాల్సిన మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గ్రామస్తులు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, రాజారత్నం, రామారావు, రాజు, శేఖర్, జంగయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

తండాలకు తారు రోడ్లు

- లింకు మార్గాలను వరించిన బీటీ
- హర్షం వ్యక్తంచేస్తున్న గిరిజనులు

దుద్యాల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గ పరిధి తండాలకు వెళ్లే మార్గాలు తారురోడ్డుతో తళతళ మెరుస్తున్నాయి. దుద్యాల మండల పరిధి హస్నాబాద్ గ్రామం నుంచి కొడంగల్ మండలం పలుగురాళ్లతండాకు 3.5 కిలో మీటర్ల దూరం, పలుగురాళ్లతండా నుంచి జీడిగడ్డతండాకు 800 మీటర్ల దూరానికి ఇటీవల బీటీరోడ్డు నిర్మించారు. దీంతో గిరిజనులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కొన్నేళ్లుగా.. తండాల రోడ్లను ఎవరూ పట్టించుకోలేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అయ్యాక.. తండాలకు వచ్చిపోయే రహదారులు సుందరంగా తీర్చిదిద్దబడుతున్నాయని వెల్లడించారు. హస్నాబాద్ గ్రామం నుంచి పలుగురాళ్లతండా, జీడిగడ్డతండాతో పాటు సమీపంలోని లింకు రోడ్ల నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ నుంచి జనవరిలో రూ.6 కోట్ల నిధులు విడుదల అయ్యాయని, అనంతరం చేపట్టిన నిర్మాణ పనులతో కొన్ని రోడ్లు పూర్తయ్యాయని స్థానిక నాయకులు పేర్కొన్నారు.



పలుగురాళ్లతండా నుంచి జీడిగడ్డతండా బీటీ

గుంతల రోడ్డుకు విముక్తి

గుంతల మయంగా ఉన్న రోడ్లతో ఇబ్బంది పడ్డామని, కొత్తగా బీటీ వేయడంతో రవాణా కష్టాలను గట్టెక్కామని పలువురు గిరిజనులు ఆనందం వ్యక్తంచేశారు. చాలా కాలంగా హస్నాబాద్ గ్రామం నుంచి పలుగురాళ్లతండాకు వెళ్లే మార్గం పూర్తిగా గోతులతో అధ్వానంగా ఉండేదని, అత్యవసర పరిస్థితుల్లో చాలా కష్టాలు ఎదురయ్యేవని వాపోయారు. ఇప్పుడు ఆ బాధ లేదని పేర్కొన్నారు.



హస్నాబాద్ నుంచి పలుగురాళ్లతండాకు వేసిన బీటీరోడ్డు

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



చాలా సంవత్సరాల నుంచి తండాలకు రవాణామార్గం సక్రమంగా లేక గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కృషితో మా తండాకు బీటీ రోడ్డు వేసి రవాణ వ్యవస్థను చక్కదిద్దారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పలుగురాళ్ల, జీడిగడ్డ తండా వాసులం రుణపడి ఉంటాము.

– దీపాబాయి, మాజీ సర్పంచ్, పలుగురాళ్లతండా